పత్రికా ప్రకటన - 5

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 28.07.2014

వారం రోజుల్లో తెలంగాణ పారిశ్రామిక విధానానికి తుదిరూపు ఇవ్వాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి పారిశ్రామిక విధాన రూపకల్పనపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ సలహాదారు బివి పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ చంద్ర, తెలంగాణ ఐఐసి ఎండి జయేశ్ రంజన్, సిఎంఓ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. పరిశ్రమల కోసం అందుబాటులో ఉన్న భూమిని సేకరించి, ముందుగానే టిఎస్ ఐఐసికి అప్పగించాలని, పరిశ్రమలకు కావాల్సిన అన్ని అనుమతులు ప్రభుత్వమే ముందస్తుగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. అన్ని పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతి అవసరం లేదని తేల్చారు. పిఓబి అనుమతి కావాల్సిన పరిశ్రమలేవో, అనుమతి అవసరం లేని పరిశ్రమలేవో తేల్చాలని కూడా చెప్పారు. టిఎస్ ఐఐసి కి కేటాయించిన భూమికి కావాల్సిన మౌలిక వసతులన్నీ సమకూర్చి వాటిని పారిశ్రామిక వాడలుగా మార్చాలని చెప్పారు. పరిశ్రమలకు కావాల్సిన నీరు, కరెంటు, ఇతర మౌలిక సదుపాయాలను వివరించడంతో పాటు, సదరు భూమి ఏ ప్రాంతంలో ఉన్నదిఫ? రైల్వే ట్రాక్, విమానాశ్రయం, నేషనల్ హైవే, స్టేట్ హైవే ఎంత దూరంలో ఉన్నవి? అనే సంగతులు కూడా తెలిపే విధంగా

మ్యాపులు, ఫోటోలు, వీడియోలతో సహా అన్ని విషయాలను వెబ్ సైట్లో పెట్టాలని చెప్పారు. ప్రపంచంలోని పెట్టుబడిదారులంతా గూగుల్ లో వెతుక్కునే విధంగా కో ఆర్డినేటర్స్ కూడా ఇచ్చి పారిశ్రామిక వాడలను ఆన్ లైన్లో పరిచయం చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనతో పాటు అందులో పనిచేసే ఉద్యోగులకు కూడా అక్కడే నివాస యోగ్యమైన టౌన్ షిప్ నిర్మించాలని, ఇందుకోసం పరిశ్రమలకు కేటాయించిన భూమిలోంచి కొంతశాతాన్ని ఇవ్వాలని చెప్పారు. పారిశ్రామిక విధానం ఎలా ఉండాలి? సింగిల్ విండో సిస్టమ్ ఎలా పనిచేయాలి? చేజించ్ సెల్ చేయాల్సిన పనులేమిటి? కొత్తగా చేయాల్సిన చట్టాలేమిటి? విధాన పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలేంటి? తదితర విషయాలన్నింటిపై వారంలోగా స్పష్టత రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటికే దేశ, విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నందున, ప్రపంచంలో మరెక్కడా లేనంత గొప్పగా తెలంగాణ పారిశ్రామిక విధానాన్నిరూపొందించాలనిచెప్పారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం.**